# వ్యాసభూమి

## వ్యాససంపుటి

డా॥ సి. భవానీదేవి

# విషయసూచిక


| | | |
|---|---|---|
| 1. | రాయప్రోలు తృణకంకణం – సమకాలీనత | 9 |
| 2. | మల్లాది రామకృష్ణశాస్త్రిగారి కథల్లో కొన్ని స్త్రీ పాత్రలు | 15 |
| 3. | నయీ కవిత – వచన కవిత్వం | 22 |
| 4. | దేవరకొండ బాలగంగాధర తిలక్ – ఒక గొప్ప కథ | 35 |
| 5. | భారతీయ స్త్రీ గురించి స్వామి వివేకానంద | 38 |
| 6. | కొవ్వలి నవలలు – కుటుంబ వ్యవస్థ | 44 |
| 7. | ఆధునిక ఋషి 'శేషేంద్ర' | 50 |
| 8. | వచన కవిత్వంలో కథాకావ్యాలు | 58 |
| 9. | అపర 'భారవి' కీ॥శే॥ చిల్లర భావనారాయణరావు గారు | 61 |
| 10. | 'దాశరథి' సినీగీతాల్లో 'స్త్రీ' | 67 |
| 11. | "నడక నా తల్లి" అని చాటిన సి.నా.రె | 73 |
| 12. | వేటూరి గీతాల్లో స్త్రీ చైతన్యం | 81 |
| 13. | వినూత్న మార్పుకు 'స్త్రీకారం' | 86 |
| 14. | 'కేతు' కథల్లో స్త్రీ పాత్రలు | 92 |
| 15. | లజ్జ నవలలో ఏముందంటే... | 98 |
| 16. | 'స్థిత ప్రజ్ఞ' శ్రీ పి.వి. నరసింహారావు | 101 |
| 17. | శ్రీకృష్ణ లీలాతరంగిణి | 110 |

18. అక్షరహాలికుడు కీ॥శే॥ కోటంరాజు సత్యనారాయణశర్మగారు 118
19. "లంకలో రామశబ్దం" సి. ధర్మారావుగారు 129
20. ఆచార్య అనుమాండ్ల భూమయ్యగారి కథా కళా వ్యాఖ్య "కర్పూర వసంతరాయలు" 135
21. కవిత్వంలో మానవసంబంధాలు 140
22. తెలుగు సినిమా వజ్రోత్సవ కథానాయిక 147
23. తెలుగు కథలు – ఆర్ద్రత 157
24. శారదామాత, సోదరి నివేదితల మానవత 167
25. మాతృభాషకు దేశీయ సాహిత్యం – యువత 176
26. గోపి నానీలు – విశ్లేషణ 183
27. తెలుగు నాటక రచనలో రచయిత్రులు 202
28. డా॥ పెళ్ళకూరి జయప్రద కథల్లో సంప్రదాయం 211
29. అబ్బూరి ఛాయాదేవి 'తన మార్గం' 215
30. తెలుగు సాహిత్య చరిత్ర – ఒక పరిచయం 220

# రాయప్రోలు తృణకంకణం - సమకాలీనత

'**ఆ**ధునికత' అనే పదాన్ని 'Modern' అనే ఆంగ్ల పదానికి సమానార్థకంగా ప్రయోగిస్తున్నాం. వస్తు వివరణంలో, రీతిలో, అభిప్రాయ వ్యంజనంలో సంవిధాన ప్రయోగంలో తత్పూర్వ సాహిత్య జీవన స్రవంతి నుంచి పూర్తిగా భిన్నమైన మార్గనిర్దేశంలో వేర్పాటు పొందిన సాహిత్యాన్నే మనం ఆధునిక సాహిత్యం అంటున్నాం. ఈ నిర్వచనం ప్రకారం ఆధునిక శబ్దం కాలవాచికదని అనుకోవచ్చు.

20వ శతాబ్దపు తలుపులు తెరుచుకుంటూనే కట్టమంచి 'ముసలమ్మ మరణం' వెలువడింది. భారతదేశంలో అనేకమంది మేధావులు జన్మించి జాతి జాగృతికి కృషి చేశారు. తెలుగు సాహిత్యంలో ప్రతిభావంతులైన రచయితలు తమకు తాముగా ప్రయోగాలు చేస్తూ సాహిత్యాన్ని సుసంపన్నం చేశారు. గురజాడ ఆధునిక సాహిత్య వైతాళికునిగా మొట్టమొదటిసారిగా తెలుగు సాహిత్యంలో ప్రేమ అనేది ఇచ్చి పుచ్చుకునే హృదయానుబంధమనీ, పెనిమిటి భార్యకు దైవం కాదనీ, స్నేహితుడు మాత్రమేననీ ప్రబోధించారు. ఈ నూతన సామాజిక దృక్పథమే తర్వాతి కాలంలో భావకవిత్వానికి, ప్రేమ కవిత్వానికి నాంది అయింది. 19వ శతాబ్దంవరకూ పచ్చి శృంగారభూయిష్ట ప్రబంధ సమూహాన్ని పటాపంచలు చేసిన కావ్యాలు రాయప్రోలు రచించారు.

బాల్యంలో వారి మేనమామ సుబ్రమణ్య శాస్త్రి గారితో కలసి కొన్నాళ్ళు అవధానాలు చేస్తుండేవారు. ఆ రోజుల్లో అవధానవిద్య అపరిమితమైన ఆదరణ పొందేది. శాంతినికేతన్‌లో చదువుకున్న రాయప్రోలు సుబ్బారావుగారు అటు రవీంద్రుని ప్రభావంతో ఏర్పడిన నూతన భావసరళిలో లలిత మనోహర కావ్యరచన ఆరంభించారు. హార్దిక కోమలత్వానికి మానవత్వానికీ ప్రాధాన్యమిస్తూ, స్త్రీపురుషుల పరస్పర ప్రేమ, త్యాగం, అంకితభావం మొదలైన భావాలు

# మల్లాది రామకృష్ణశాస్త్రిగారి కథల్లో కొన్ని స్త్రీ పాత్రలు

**మా**నవ నాగరికత ఎంత పాతదో కథ కూడా అంత పాతది. ఆ కథ కొన్ని మార్పుచేర్పులతో ఇప్పుడు మనం చూస్తున్న, వ్యవహరిస్తున్న చిన్న కథగా రూపొందింది. తెలుగులో దీనికి ఆద్యులు భండారు అచ్చమాంబ అయితే స్థిరీకరించబడిన రచయిత గురజాడ. వారి తొలి కథ **"దిద్దుబాటు."**

కథ అంటే ఒక ఎత్తుగడతో పాఠకుడి ఊపిరికి ముక్కుతాడు వేసి ఒక్క చూపుతో చివరిదాకా లాక్కుపోయే ఉత్కంఠ, గగుర్పాటు, చమత్కారం గల ముగింపు.., ఇవన్నీ కథ లక్షణాలుగా చెప్తారు. కథావస్తువులో స్పష్టత, నాటకీయత, సరళత ఉండాలి. మొదలుపెట్టాక చదివించి ముగిసిన తీరు, ఆ కథ ఇచ్చిన సందేశాల వల్ల మంచి కథయితే ఓ నమూనాగా నిలబడిపోతుంది.

శ్రీపాద, చలం, వేటూరి, అడివి బాపిరాజు, మునిమాణిక్యం ఇలా ఎందరో మహానుభావులు 1910వ సంవత్సరం నుంచి ఇప్పటిదాకా ఆ కలం కాగడాని అందించుకుంటూ వస్తున్నారు. కథారచయితల సంఖ్య పెరిగింది. 1935వ సంవత్సరం తర్వాత అతిరథ మహారథులే కనిపిస్తారు. కొడవటిగంటి, గోపీచంద్, బుచ్చిబాబు, పాలగుమ్మి వారసత్వాన్ని కొనసాగిస్తున్న రచయితలున్నారు. అనేక ప్రత్యేక సంచికలు, వార, మాస పత్రికలు, కథల్ని ప్రోత్సహిస్తున్నాయి.

కథగురించి ఇంతకథ చెప్తున్నాను. ఈ కథల పల్లకీ మోసిన బోయీలలో ఒక ముఖ్య కథారచయిత శ్రీ మల్లాది రామకృష్ణశాస్త్రి. తేనెలూరే తెలుగు వాడుకభాషలోని విన్యాసాల్ని కప్పురపు కుప్పలుగా రాశిపోశారు రచయిత.

# భారతీయ స్త్రీ గురించి స్వామి వివేకానంద

ఆధునిక మహిళ ప్రపంచవ్యాప్తంగా అలజడికి గురవుతోంది. పైకి చెప్పకపోయినా లోపల బాధ, అశాంతి, ఘర్షణ, స్త్రీ పురుషుల మధ్య విద్వేషాల గురించి ఎక్కువగా వింటున్నాం. స్త్రీ తనకి సంకెళ్లు వేశారని భావించి పోరాడి సాధించిన స్వేచ్ఛకూడా నిజంగా స్వేచ్ఛేనా అనే ఆలోచన వస్తున్నది. మహిళ వంటింటి కుందేలుగా ఎవరికో భార్యగా, ఇంకెవరికో తల్లిగా, సాంఘిక ఆర్థిక స్వేచ్ఛ లేకుండా తనకంటూ వ్యక్తిగత స్థాయి, మర్యాద లేకుండా ఉండటం గురించి అమెరికన్ రచయిత్రి బెట్టీ ఫ్రైడస్ "ది ఫెమినైన్ మిస్టిక్" లో పేర్కొన్నారు. దీనిద్వారా మహిళలు ఆస్థితినుంచి బయటపడటానికి ఉద్యమం చేసి పురుషులతో సమానంగా పోటీపడ్డారు. కొన్ని లక్ష్యాలు సాధించారు కూడా. అయితే ఆ పోరాటంలో స్త్రీ పురుషులిరువర్గాలకు చాలా నష్టం జరిగింది. కుటుంబవ్యవస్థ చిన్నాభిన్నమైంది. వివాహవ్యవస్థ బలహీనపడింది.

ఈ పాశ్చాత్య ధోరణిని, వాదాన్ని అందిపుచ్చుకుని అశాంతి పాలవుతున్న భారతీయమహిళలు తమకేంకావాలో ఆలోచించి నిర్ణయించుకునేముందు ఓసారి తమ ఆలోచనల్ని స్వామి వివేకానందునికేసి మరల్చవలసి ఉంది. 19వ శతాబ్దిలోనే భారతీయ సంస్కృతి మహత్తును విశ్వవేదికపై వెలిగించిన స్వామిజీ శారదాదేవివంటి స్త్రీశక్తి ముందు మోకరిల్లి ఆమెకి శిష్యుడిగా రామకృష్ణ మఠ స్థాపనకుపక్రమించి నేటికీ ఎందరో బాధితుల కన్నీరు తుడిచే వ్యవస్థను రూపొందించటం అద్భుతాంశం.

స్వామి వివేకానంద స్త్రీ పురుషుల సమానత్వానికి పాటుపడిన ఆధునిక నాయకుడు. మగవాళ్ళు మాత్రమే చదువుకొని, ఆడవాళ్ళని నిర్లక్ష్యం చేస్తే ఏ సంఘమూ అభివృద్ధి చెందదని ఖచ్చితంగా చెప్పిన మహనీయుడు. మన దేశ ప్రగతి కుంటుపడటానికి కారణం శతాబ్దాలుగా స్త్రీలను నిర్లక్ష్యం చేయటమేనని

# వచన కవిత్వంలో కథాకావ్యాలు

కవితా స్వరూపాన్ని పరిశీలించే ముందు 'కవి' అంటే ఏమిటో ఆలోచించాలి. వైదిక మంత్రాలలో కవి శబ్దం 'పరమాత్మ' అనే అర్థంలో వాడబడింది. క్రమంగా 'ఋషి' అని కూడా వ్యాప్తమైంది. కవి ద్రష్ట, స్రష్ట, క్రాంతదర్శి కూడా! పూర్వకాలంలో వాల్మీకి, వ్యాసుడు మొదలైన కవులు ఋషులు కూడా కావటం వల్ల ఋషులే కవులవుతారన్న నానుడి కూడా ఏర్పడింది.

> **"అపారే కావ్యసంసారే కవిరేకః ప్రజాపతిః**
> **యథాస్మైరోచతే విశ్వం తథైవ పరివర్తతే"**

అందుకే సీర్స్, ప్రాఫెట్స్, ఫిలాసఫర్స్, బిలీవర్స్ అనే వర్గీకరణలో రస్కిన్ పొయెట్స్‌ని కూడా చేర్చాడు. ప్రకృతి దర్శనంవల్ల కవి తన మనసులో కలిగే అనుభూతుల్ని నిశితంగా వ్యక్తీకరిస్తాడు. ఆయా కవుల సంస్కారాలను బట్టి ఉత్తమ భావన సృష్టించబడుతుంది. కవిత్వమెంత సనాతనమో అంత నిత్యనూతనం! వివిధ పండితులు కవిత్వాన్ని పలురకాలుగా నిర్వచించారు. అనందవర్ధనుడు, క్షేమేంద్రుడు, ముమ్మటుడు, విశ్వనాథుడు, జగన్నాథుడు మొదలైన వారేగాక అరిస్టాటిల్‌నుండి కాల్‌రిడ్జ్‌వరకూ తమ తమ దృష్టికోణాన్ని అనుసరించి వివరించే ప్రయత్నం చేశారు. కవికి ప్రతిభ గుండె అయితే పాండిత్యం కండగా సమాజానికి ప్రయోజనకరమైన కవిత్వాన్ని అందించ గల్గుతాడు.

శాసనాల ఆధారంగా నన్నయ్యకు పూర్వం తెలుగు భాషా స్వరూపం దేశి ఛందస్సులో రాయబడిన పదములు, గేయాలు, శాసన కవిత, కావ్య కవితలు మాత్రమే! కవిత్వానికి కొత్త దారులు వేసిన నన్నయ్య తర్వాత

# 'దాశరథి' సినీగీతాల్లో 'స్త్రీ'

**20**వ శతాబ్ది కవుల్లో దాశరథి కృష్ణమాచార్యులుగారు అగ్రగణ్యులు. హైదరాబాద్ సంస్థాన విలీనం కోసం ఆయన చేసిన త్యాగపోరాటం చిరస్మరణీయం.

"ఓ నిజాము పిశాచమా! కానరాదు
నిన్ను బోలిన రాజు మా కెన్నడేని
తీగెలను తెంపి అగ్నిలో దింపినావు
నా తెలంగాణ.. కోటి రతనాల వీణ"

అంటూ ఆ వీణపై ఆయన పలికించిన అభ్యుదయ భావాలు త్రికాలాలకు స్ఫూర్తివంతాలు. "తిమిరంతో సమరం, రుద్రవీణ, అగ్నిధార, జ్వాలాలేఖిని, అమృతాభిషేకం, మహాభోధివంటి అద్భుత కావ్యసృష్టి చేసిన దాశరథి ఆణిముత్యాల్లాంటి సినీగీతాలను అందించి చలనచిత్ర సంగీతానికి రంగునూ పరిమళాన్నీ అద్దారు.

దాశరథిగారు సినిమాలకు రాసిన అసంఖ్యాక గీతాలలో వీణ పాటలకు ప్రత్యేకత ఉంది. సాలూరి, ఘంటసాల, పెండ్యాల వంటి సంగీతజ్ఞుల స్వరకల్పనలో దాశరథి వీణపాటలు నిత్య స్మరణీయాలు. ఈ పాటల్లో చాలావరకు స్త్రీ మానసిక మాధుర్యాన్నీ, ప్రణయతత్త్వాన్నీ విరహవేదననీ వ్యక్తీకరించే పాటలే! "పూలరంగడు"లో "నీవు రావు నిదుర రాదు", "రెండు కుటుంబాల కథ'లో "వేణుగానలోలుని కన వేయికనులు చాలవులే", 'అమాయకురాలు'లో "పాడెద నీ నామమే గోపాలా", 'ఆత్మీయులు'లో "మదిలో వీణలు మ్రోగె.. ఆశలెన్నొ చెలరేగే", 'అంతా మన మంచికే'లో "నేనే రాధనోయి.. గోపాలా" దాశరథిగారి కలం నుంచి జాలువారిన ఈ అమృత గీతాలన్నీ సంగీత సాహిత్య సమలంకృతాలు.

# వినూత్న మార్పుకు 'స్త్రీకారం'

ఆధునిక ప్రపంచం సహేతుకమైన శాస్త్రీయ విజ్ఞానంతో మానవ ప్రగతికి దోహదకారిగా ఉంది. ప్రజాశక్తితో దేశాలు అభివృద్ధిని సాధిస్తున్నాయి. అమెరికా స్వాతంత్ర్య ప్రకటన (1776) ఫ్రెంచి విప్లవం (1789) పారిశ్రామిక విప్లవంతోబాటు యూరప్ దేశాల శాస్త్ర సాంకేతిక పరిశోధనా ఫలితాలు అందు బాటులోకి రావటంవల్ల 18వ దశాబ్దం నుంచి విశ్వగమనంలో గుర్తించదగిన మార్పు వచ్చింది. అంతకుముందు నిరంకుశులైన రాజులు, మతాధికారులు మానవహక్కుల్ని కాలరాసి పరిపాలించారు. శాస్త్ర సాంకేతిక విజ్ఞానకర్తల్ని మొదట్లో చర్చి వ్యతిరేకించి శిక్షించినా తర్వాత కాలంలో అంగీకరించక తప్పలేదు. ప్రజల జీవనస్థాయి పెరిగింది కానీ శాంతి కరువైంది. మేధస్సు పెరిగింది. కానీ జ్ఞానం తగ్గింది. జీవనస్థాయి పెరిగినా హృదయస్థాయి పెరగలేదు. ఇటువంటి పరిస్థితుల్లో మహిళల స్థితిగతులెలా ఉన్నాయి ఏ దిశగా మార్పు చెందాయో ఆలోచించాల్సి వుంది.

ప్రపంచ దేశాల్లో మహిళలు శాస్త్ర విజ్ఞానరంగంలో ముందుకు వెళ్తూ తమ జీవనస్థాయిని మెరుగుపరుచుకున్నారు. అన్ని రంగాలలో ప్రవేశించారు. హక్కుల కోసం చైతన్యంతో ఉద్యమించారు. ఇరవై ఒకటవ దశాబ్దకాలం నాటికి పాశ్చాత్య దేశాల్లో మహిళలు విద్యావంతులుగా తమ జీవనశైలిని చాలా ఆధునికంగా తీర్చిదిద్దుకున్నారు. హృదయం కన్నా మేధస్సుకు ప్రాధాన్యతనిస్తూ అన్ని రంగాలలో చైతన్యం కనపరిచే పాశాత్య మహిళలకు సమస్యలున్నా అవగాహనతో పనిచేస్తున్నారు. సంఘర్షణలను ధైర్యంగా ఎదుర్కొంటున్నారు.

మరి భారతీయ మహిళ మార్పుల్ని ఎలా స్వీకరించింది. 21వ దశాబ్దితో ఆమె ఆలోచనలు, సమస్యలు, ఆచరణ ఎలా ఉన్నాయో పరిశీలిద్దాం.

# లజ్జ నవలలో ఏముందంటే...

**1992** వ సంవత్సరంలో భారతదేశంలో బాబ్రీ మసీదు విధ్వంసం జరిగిన వెంటనే బంగ్లాదేశ్‌లో ముస్లింలు హిందువుల్ని వేటాడడం ఇతివృత్తంగా ఏడురోజుల్లో లజ్జ నవలను తస్లీమా నస్రీన్ రాసారు. 1993వ సంవత్సరం ఫిబ్రవరిలో బంగ్లాదేశ్‌లో ప్రచురించబడి ఐదు నెలల తరువాత ప్రభుత్వం నిషేధించేలోపే 60 వేల ప్రతులు అమ్ముడయిన ఈ నవల ఒక రచయిత్రి మీద ఫత్వా జారీ చేయడానికి కారణమైంది. లజ్జ నవలలో ఏముందో ఓసారి గుర్తు చేసుకుందాం!

ఇండియాలో బాబ్రీమసీదు విధ్వంసం జరిగాక బంగ్లాదేశ్‌లో హిందువులపై జరిగిన హింస ఈ నవల కథా వస్తువు. అందమైన తన దేశంలో అటువంటి భయంకరమైన సంఘటనలు జరగడం అవమానకరంగానూ, అవి సామూహిక పరాజయానికి సాక్ష్యపత్రమని రచయిత్రి భావించారు. మత దురహంకార జాడ్యం ఏ దేశంలో, ఏ దశలో ఉన్నా ఎటువంటి సవాళ్ళు, ప్రాణహాని ఎదురైనా పోరాడాలని, లౌకికవాదులు, మానవతావాదులు చేతులు కలిపి మత దురహంకార శక్తుల్ని ఎదుర్కోవాలని ఈ నవలద్వారా నస్రీన్ పిలుపునిచ్చారు. కల్పిత పాత్రలు, వాస్తవ చారిత్రక సంఘటనలు. గణాంక వివరాలు, వివిధ పత్రికల్లోని రిపోర్టుల నుంచి సేకరించిన సమాచారాన్ని నవలలో చేర్చడం జరిగింది.

1947వ సంవత్సరం ఆగస్టు 14 వ తేది పాకిస్తాన్ ఒకే ముస్లిం దేశంగా అవతరించిన భూభాగంలో అంతర్భాగంగా ఉన్న తూర్పు పాకిస్తాన్ బంగ్లాదేశ్ అనే స్వతంత్ర దేశంగా అవతరించడం, ఇస్లాంను జాతీయ మతంగా ప్రకటించడం, 1991, 1992 సంవత్సరాల్లో జరిగిన మతకలహాల్లో అల్పసంఖ్యాక మతస్థులపైన దౌర్జన్యకాండవంటి కాలఘటనల విశ్లేషణ, ఆయా

# అక్షరహాలికుడు
# కీ॥శే॥ కోటంరాజు సత్యనారాయణశర్మ

అది జనవరి 4, 1926 సంవత్సరం గుంటూరు జిల్లాలోని ఆలూరులో తాతగారి ఇంట ఉదయం పాదచ్ఛాయలు ప్రొద్దు ఎక్కినపుడు సత్యనారాయణశర్మ పుట్టారు. వారి స్వస్థలం ములుకుదురు. ఆలూరులో పుట్టిన వారిని తర్వాత కొద్దిరోజులకు ములుకుదురు తీసికొని వచ్చారు. అచ్చట ఆయన బాల్యం గడచింది. 5వ సంవత్సరం రాగానే బళ్లో వేశారు. శ్రీ కోన వీరరాఘవరావు మేష్టరుగారు "ఓనమా"లు దిద్దబెట్టారు. అయిదు తరగతులు అక్కడే చదివారు. 6వ తరగతికి ఇంగ్లీషు ట్యూషన్ చెప్పించి, పొన్నూరు, ఇ.బి. హైస్కూల్‌లో సెకండ్ ఫామ్‌లో చేర్చారు. సెకండ్ ఫామ్ నుండి సిక్త్ ఫామ్ వరకు (ఎస్.ఎస్.ఎల్.సి.) పొన్నూరు హైస్కూల్‌లో చదివారు. ములుకుదురునుండి టిఫిన్ కారియరులో అన్నం కట్టుకొని బస్సులో పొన్నూరు వెళ్ళి వచ్చేవారు. థర్డ్ ఫామ్ మాత్రం ఆలూరులో అమ్మమ్మ గారి ఇంట్లోఉండి చదివారు. ఆలూరు పొన్నూరుకు రెండు మైళ్లు.

అలా ఫోర్త్ ఫాం అయిన తర్వాత ఇంటర్ చదవడానికి గుంటూరు పోవాలి. అందుకు ఆర్థికస్తోమత లేదు. అందువల్ల బాపట్లలో ఉండి టైపు, షార్ట్‌హాండ్ ఒక సంవత్సరం నేర్చుకొన్నారు. 1942వ సంవత్సరంలో క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నారు. బ్రిటీష్‌వారికి వ్యతిరేకంగా పత్రికల్లో వ్యాసాలు రాసినందుకు బాపట్ల జైల్లో పెట్టారు. పదహారేళ్ళ మైనర్ అని తర్వాత వదిలేశారు. తర్వాత 1943వ సంవత్సరంలో గుంటూరు హిందూ కాలేజీలో ఇంటర్ చదివే సౌకర్యం కల్గింది. తల్లిగారు "బియ్యం, పప్పు ఉప్పు కట్టి యిస్తాను. గుంటూరులో వండుకొని తిని ఇంటర్ చదువుకో"

# ఆచార్య అనుమాండ్ల భూమయ్యగారి కథా కళా వ్యాఖ్య "కర్పూర వసంతరాయలు"

"కర్పూర వసంతరాయలు" అనే పేరే అద్భుతమైన ఆకర్షణ. కర్పూరం పరిమళానికి మూలం. వసంతం అందానికి, ఆనందానికి, యవ్వనానికి పరిమళానికి సంకేతం. ఈ రెండూ మేళవించుకున్న కావ్యం డా. సి. నారాయణ రెడ్డిగారి కర్పూర వసంతరాయలు. నాటికి నేటికీ అదే ఆకర్షణతో నిలిచిన ప్రణయ సౌందర్య దీపిక ఈ గేయకావ్యం.

ఈ కావ్య రచయిత డా॥ సి.నారాయణరెడ్డి గారు. 1957వ సంవత్సరంలో అచ్చయిన ఈ కావ్యం గురించి భూమయ్యగారు అద్భుతమైన వ్యాఖ్య రాశారు. వ్యాఖ్య అని ఎందుకంటున్నానంటే కర్పూర వసంతరాయలు కావ్యరచనా కాలం, నేపథ్యం నుంచి మొదలుపెట్టి ఆనాటికి సినారె సాహితీ నేపథ్యం కూడా చెప్పి ఈ గ్రంథం ఆద్యంతం కర్పూర వసంతరాయలు, లకుమల దివ్య దాంపత్యాన్ని హృద్యంగా వింగడించారు. ఈ కావ్యంలోని కొత్త కోణాలను, సరికొత్త ఆలోచనా తరంగాలను ఆవిష్కరించారు.

'విమర్శ రూపిణీ విద్యా' అనేది లలితా రహస్య నామాల్లో ఉంది. విమర్శ విద్యా స్వరూపంగా విప్పి చెప్పేది. అది కావ్యంలోని కమనీయతను సోదాహరణంగా వివరిస్తూనే కావ్యగతి, కథనాన్నీ వివరించి ఫలశ్రుతి అంటే ఆ కావ్య ప్రయోజనాన్నీ అందిస్తుంది.

ఆచార్య భూమయ్యగారు ఎంతటి ఉన్నత పదవులు నిర్వహించినా హృదయరీత్యా కవి, విమర్శకుడు. "జ్వలిత కౌసల్య" లాంటి స్త్రీ పరివేదనా కావ్యాన్ని అందించిన ఆర్ద్ర హృదయుడు. హిందీసాహిత్యంలో మైథిలీశరణ్

# తెలుగు కథలు - ఆర్ద్రత

తెలుగులో కథా వాఙ్మయం అత్యంత ప్రాచీనమైనది. భారతంలో అనేక కథలు, ఉపకథలు, దశకుమార చరిత్ర, బోజరాజీయ కథలు, విక్రమార్క కథలు, కాశీమజిలీ కథలు, పేదరాసి పెద్దమ్మ కథలు ప్రజల్ని అలరింప జేశాయి. 1850వ సంవత్సరంనుంచి ఆంగ్లసాహిత్య ప్రభావం తెలుగు కథా సాహిత్యంపై ప్రసరించిన తర్వాత 1892వ సంవత్సరంలో కందుకూరి గలివర్స్ ట్రావెల్స్‌ను "సత్యరాజా పూర్వదేశ యాత్రలు" పేరుతో అనువదించారు.

**కథ రచయిత ఎగరేసిన జెండా**
**అది గుండెకి స్ఫూర్తినివ్వాలి**
**భవిష్యత్తుకు కాంతినివ్వాలి**
**నిరంతరం స్మరించుకునే చిహ్నం అవ్వాలి.**

రచయిత మనసులో సుళ్ళు తిరుగుతూ సాగే భావాల ప్రవాహంలా కథ క్లుప్తంగా లోతుగా, సాంద్రంగా ఉంటూ పరిపూర్ణతను కాలక్రమంలో సాధించింది. ప్రతి మంచికథ సామూహిక చైతన్యాన్ని తనలో ఇముడ్చుకుని ఉవ్వెత్తున లేచే కెరటంలా కన్పిస్తుంది.

'కథల్లో ఆర్ద్రత' ప్రస్తుతాంశం. నవరసాలకు అన్ని సాహితీరూపాల్లో స్థానం ఉంది. మరి ఆర్ద్రత స్థానం ఏంటి? అసలు ఆర్ద్రత అంటే 'కరుణ' అనుకోవాలి. కరుణను కలిగించేది హృదయానుభూతి. హృదయాన్ని కదిలించే శక్తి కరుణ రసానికున్నంతగా మరి దేనికీ లేదు. కథాంశం ఏదైనా, వస్తువేదైనా ఎంత అద్భుతంగా ఆవిష్కరింపబడుతున్నా పఠితలోని మానవీయ మూలాలను తట్టిలేపకపోతే దానికి సార్థకత ఉండదు. భవభూతినుండి నేటివరకు కరుణ రసానికే పెద్దపీట వేశారంటే తల్లిలాంటి ఆర్ద్రభావం కథకు జీవం, ప్రాణం

# మాతృభాషకు దేశీయ సాహిత్యం - యువత

**యు**వతరం ఏ దేశానికైనా అనంతశక్తి భాండాగారం. ఆ శక్తిని సంపూర్ణంగా ఉపయోగించుకొన్న దేశం తన భవిష్యత్తును జాజ్వల్యమానంగా తీర్చిదిదుకోగల్గుతుంది. యువశక్తి అటువంటిదనే సత్యాన్ని యువత తెలుసు కోవటం లేదు. మహాశక్తివంతుడైన హనుమంతుడుకూడా తనకి సముద్రం దాటే సామర్థ్యం ఉందని పలువురు గుర్తు చేస్తేగానీ తెలుసుకోలేకపోయాడు. ఇదే పరిస్థితి యువతరంలో ఉంది. నేటి భారతంలో యువత శక్తి సామర్థ్యాలు నిద్రాణమై ఉన్నాయి. కార్యసాధకులు కావలసిన యువతరం తమ వ్యక్తిత్వాన్ని సమగ్రంగా తీర్చిదిద్దుకోటానికి అనువైన పరిస్థితులు కల్పించుకోవాలి. గమ్యాలను సాధించుకోవటానికి సరియైన విధానాలను గ్రహించాలి. నైపుణ్యాన్ని సంపాదించాలి.

'యువత' అనే పదం వింటేనే మన నరనరాల్లో పులకరింత అనుభూతి అవుతుంది. శక్తి, ధైర్యం ఉత్సాహాలకు ప్రతీక అయిన యువతమీదే యావత్ప్రపంచం చాలా ఆశలు పెంచుకుంది. యువత ఎన్నో కష్టమైన పనులను కూడా సునాయాసంగా మందహాసంతో చేయగలుగుతారు. ఎంత పనిచేసినా ఉత్సాహాన్ని మళ్ళీ నింపుకొంటారు. ఆధ్యాత్మికత, తత్త్వం, సాహిత్యం, కళలు, సాంకేతికశాస్త్రం, వ్యవసాయం ఇంకా పారిశ్రామిక రంగాలలో సరికొత్త విషయాలను వెంటనే ఆకళింపు చేసుకునే మేధస్సును కలిగి ఉంటారు.

నేటి భారతదేశ యువత ఎదుట చాలా అవకాశాలు కన్పిస్తున్నాయి. అయితే విజ్ఞతతో ఆలోచించి తమ భవిష్యత్తునూ, తద్వారా దేశ భవిష్యత్తునూ వారే తీర్చిదిద్దుకోవాలి. వివేకం, అప్రమత్తత, వివేచనతో వ్యవహరించాలి. శక్తిని ఎవరూ సృష్టించనవసరం లేదు. అది మనిషిలో అంతర్లీనంగా ఉంటుంది.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Vyasabhoomi**

* * *